నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, ఆదివారం 31 మార్చి 2024 | VIKARABAD


- బీఆర్ఎస్ పాలన తెలంగాణలో స్వర్ణ యుగం
- మానవత్వం లేనివారే ఎన్నికల సమయంలో పార్టీ మారుతారు
- బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించి పార్టీలు మారినవారికి ప్రజలు బుద్ధి చెప్పాలి
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి
- కేసీఆర్ చేసిన అభివృద్ధే నన్ను గెలిపిస్తుంది
- చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్
- వెన్ను పోటు పొడిచిన మహేందర్‌రెడ్డి, సునీతారెడ్డికి రిటర్న్ గిఫ్ట్ ఖాయం
- మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్‌రెడ్డి




పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

## వెన్నుపోటుదారులకు
# ఓటుతో బుద్ధి చెప్పాలి

తాండూరు, మార్చి 30 : బీఆర్ఎస్ పాలన తెలంగాణలో స్వర్ణ యుగమని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. శనివారం తాండూరులో ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ మానవత్వం లేనివారే ఎన్నికల సమయంలో పార్టీ మారుతున్నారని నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ పార్టీలో పదవులు అనుభవించి పార్టీలు మారినవారికి ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సూచించారు. ఈ ప్రాంత ప్రజలకు తెలియని రంజిత్‌రెడ్డిని కేసీఆర్ ఎంపీగా గెలిపించి పరిచయం చేశారని, రెండు సార్లు బీఆర్ఎస్ 'కారు' గుర్తుపై గెలిచి ఇప్పుడు మనకు ప్రత్యర్థులుగా పోటీ చేస్తున్నారన్నారు. వారికి ఈ ప్రాంత ప్రజలు ఓటుతో సరైన సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉండాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ అసత్యపు వాగ్దానాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. ఇరు పార్టీలు గ్యారెంటీలతో సాధ్యం కాని హామీలు ఇస్తున్నాయని, ప్రజలు గుణపాఠం చెప్పాలని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు ఇచ్చిన రూ.వేల కోట్ల అభివృద్ధి పనులు జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. వికారాబాద్ జిల్లా అభివృద్ధి సాధించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పర్యాద కృష్ణమూర్తి, నర్సింహులు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నయీం, నర్సిరెడ్డి, కోహిర్ శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, తాండూరు జడ్పీటీసీ మంజుల గౌడ్, వైస్ ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

### ఇకనుంచి గెలుపు బీఆర్ఎస్‌దే..

**తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి**



సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేత, అన్ని వర్గాలకు ఆప్తుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి కృషి చేసిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. తాండూరు నియోజకవర్గం నుంచి లక్షకు పైగా మెజార్టీ రావాలి. పార్టీలో ఉండి వెన్నుపోటు పొడిచిన వారిని పొలిమేర దాటనివ్వద్దు.

### వాళ్లకు ధనముంటే.. మాకు ప్రజాబలముంది..

**కాసాని జ్ఞానేశ్వర్**



పదేండ్ల పాటు కేసీఆర్ చేసిన అభివృద్ధి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా నేను చేసిన పనులు చూసి కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలి. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ధనికులైతే నాకు ప్రజాబలం ఉన్నది. 96 కులాల బీసీ ఐక్య వేదికను ఏర్పాటు చేసి ఒక్కతాటికి తీసుకొచ్చా. కులమతాలకు అతీతంగా ఓటు వేసి ఆశీర్వదించాలి. చేవెళ్ల పార్లమెంట్ ప్రజలందరి ఆశీర్వాదంతో తప్పకుండా విజయం సాధిస్తా.

### మోసగాళ్లకు రిటర్న్ గిఫ్ట్ ఖాయం..

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్**



లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న కీలక సమయంలో పార్టీ వీడుతున్న నేతలకు సిగ్గు లేదు. రాజకీయాల్లో అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదు. కానీ అధికారం పోగానే.. సొంత ప్రయోజనాల కోసం పార్టీ వదిలి ఇతర పార్టీల్లో చేరడం విడ్డూరం. బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటూ వికారాబాద్ జిల్లాలోని ఎమ్మెల్యేలను ఓడించేందుకు కుట్రలు చేసిన ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి సరైన గుణపాఠం చెబుతాం. ప్రజలతో మమేకమైన మంచి వ్యక్తి కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి.

## బీజేపీ.. మతం పేరుతో మభ్యపెడుతున్నది..

**మంత్రి శ్రీధర్‌బాబు**



ఇబ్రహీంపట్నం, మార్చి 30 : మతం పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతున్నదని రాష్ట్ర ఐటీ, వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆరోపించారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని ఉప్పరిగూడ ఎక్స్‌రోడ్డు వద్ద పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ శంకుస్థాపనలో పాల్గొన్న అనంతరం శేరిగూడలో విలేకరులతో మంత్రి మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాగైనా లబ్ధిపొందాలని బీజేపీ మతం రంగును పులమడానికి యత్నిస్తుందన్నారు. పదేండ్లు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా ఉద్యోగావకాశాలు కల్పించలేదన్నారు. అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలతో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం ఆచరణలో అమలు చేయలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచిన ఘనత బీజేపీదేనన్నారు. గ్యాస్ సిలిండర్ ధరలనూ బీజేపీ ప్రభుత్వం విపరీతంగా పెంచిందన్నారు. మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రాజీవ్‌ఆరోగ్యం కింద పది లక్షల ఆర్థిక సాయం, 500లకు గ్యాస్ సిలిండర్, 200యూనిట్లకు ఉచిత విద్యుత్ వంటి హామీలను ఇప్పటికే అమలు చేశామన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే ప్రజల అవసరాలనుతీర్చి ప్రజాప్రభుత్వంగా పేరు తెచ్చుకున్నదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులంతా సంఘటితంగా పని చేస్తూ ప్రజల అవసరాలను తీరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు మల్‌రెడ్డి రాంరెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, జడ్పీటీసీ భూపతిగల్ల మహిపాల్, టీపీసీసీ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, పాండురంగారెడ్డి, గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలకూ
# తప్పని నీటి తిప్పలు

మంచాల, మార్చి 30 : మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు కూడా తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ప్రైవేటు ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేస్తున్నారు. శనివారం మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి నీటి సమస్య నెలకొనడంతో సంబంధిత అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేశారు. మార్చిలోనే తాగునీటి సమస్య ఏర్పడితే రాబోయే రెండు నెలల్లో ఎలా ఉంటుందోనని సిబ్బంది, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మంచాలలో ట్యాంకర్ ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్న సహకార సంఘం అధికారులు



వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేటలో విక్టరీ సింబల్‌ను చూపిస్తున్న విద్యార్థినులు

# ముగిసిన 'పది' పరీక్షలు

- రంగారెడ్డి జిల్లాలో 50,914 మందికి గాను 50,773మంది హాజరు
- వికారాబాద్ జిల్లాలో 13,475 మందికి గాను 13,403 మంది హాజరు

షాబాద్, మార్చి 30: పదో తరగతి పరీక్షలు సజావుగా ముగిశాయి. మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు కొనసాగాయి. చివరి రోజు శనివారం 50,914 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 50,773 మంది హాజరయ్యారు. 141 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 239 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సైన్స్ పరీక్ష రెండు రోజుల పాటు జరుగడంతో ఒక్కో పేపర్‌కు గంటన్నర సమయం ఇచ్చారు. జిల్లాలో ప్రతి పరీక్షా కేంద్రానికీ ఓ చీఫ్ సూపరింటెండెంట్, ఓ డిపార్ట్‌మెంటల్ అధికారి, జిల్లావ్యాప్తంగా 2,450 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రతి కేంద్రానికీ ఓ సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 144 సెక్షన్‌ను విధించారు.

### వికారాబాద్ జిల్లాలో..

వికారాబాద్, మార్చి 30 : వికారాబాద్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు సజావుగా ముగిశాయి. జిల్లాలో 80 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. నోడల్ అధికారులు, సూపరింటెండెంట్లు, సిబ్బంది పరీక్షవేక్షణలో పరీక్షలు జరిగాయి. జిల్లాలో 13,412 మంది విద్యార్థుకుగాను 13,349 మంది హాజరు కాగా, 63 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ప్రైవేటులో 63 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 54 మంది హాజరు కాగా, 9 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ పేర్కొన్నది.



రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

## ధాన్యం
# కొనుగోళ్లకు రెడీ

- రేపటి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- ప్రతి మండలంలోనూ ఒక్కో కొనుగోలు కేంద్రం ప్రారంభం
- వచ్చే నెల చివరి నాటికి అన్ని కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- వికారాబాద్ జిల్లాలో 122, రంగారెడ్డి జిల్లాలో 35 కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు

**మద్దతు ధర**
ఏ-రకం వరి ధాన్యం రూ.2203,
బీ-రకం రూ.2183



రంగారెడ్డి జిల్లాలో 35 కేంద్రాలు ఏర్పాటు..

**యాసంగి సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యాన్ని సేకరించేందుకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతున్నది. రేపటి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు. ముందుగా ప్రతి మండలంలో ఒక్కో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరించనుండగా, వచ్చే నెల చివరినాటికి పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచారు. వికారాబాద్ జిల్లాలో 122, రంగారెడ్డి జిల్లాలో 35 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. పీఏసీఎస్, డీసీఎంఎస్, ఏఎంసీ, ఐకేపీ, ఎఫ్ఎస్‌సీఎస్‌ల ఆధ్వర్యంలో ధాన్యాన్ని సేకరించనున్నారు. ఏ-రకం వరి ధాన్యం రూ.2203, బీ-రకం రూ.2183గా ప్రభుత్వం మద్దతు ధరను నిర్ణయించింది. వికారాబాద్ జిల్లాలో 1.90 లక్షల మెట్రిక్ టన్నులు, రంగారెడ్డి జిల్లాలో 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది.**

### వికారాబాద్ జిల్లాలో..

వికారాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణకుగాను జిల్లా యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. ఏప్రిల్ 1 నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు. త్వరగా చేతికొచ్చే ధాన్యాన్ని బయట మార్కెట్‌లో విక్రయించి రైతులు నష్టపోకుండా ముందుగా ప్రతి మండలంలోనూ ఒక్కో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఏప్రిల్ చివరి నాటికి జిల్లావ్యాప్తంగా క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తీసుకొచ్చేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. వరి క్వింటాలుకు 'ఏ' గ్రేడ్ రకం రూ.2203, సాధారణ రకం క్వింటాలుకు రూ.2183లకు ప్రభుత్వం ధాన్యాన్ని సేకరించనున్నది. ధాన్యం విక్రయించిన రెండు, మూడు రోజుల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేయనున్నది. జిల్లాలో 84,848 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, 1.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారుల అంచనా.

### జిల్లాలో 122 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు..

జిల్లావ్యాప్తంగా 122 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 61, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 27, ఏఎంసీ ఆధ్వర్యంలో 3, ఐకేపీ ఆధ్వర్యంలో 27, ఎఫ్‌సీఎస్ ఆధ్వర్యంలో 4 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. 8–10 గ్రామాలకు ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి, రోజుకు 50 మంది రైతుల నుంచి 1000 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏ తేదీన ధాన్యాన్ని తీసుకురావాలన్న విషయమై ఏఈవోలు టోకెన్ అందజేస్తారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు జిల్లాలో 59 గోదాములను సిద్ధంగా ఉంచారు. ఈ ఏడాది 57,396 మంది రైతులు 84 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. పరిగి, కులకచర్ల, దోమ, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, కొడంగల్, తాండూరు, యాలాల, ధారూరు, మర్పల్లి, కోట్‌పల్లి మండలాల్లో అధికంగా వరి సాగు చేశారు. యాసంగిలో 40 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని గుర్తించి అధికారులు అందుబాటులో ఉంచారు.

### ప్రతి రైతుకూ కనీస మద్దతు ధర..

**జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**

వికారాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. రైతులెవరూ తక్కువ ధరకు ఇతరులకు విక్రయించకుండా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ప్రతి రైతుకూ కనీస మద్దతు ధర వచ్చేలా అధికారులు చర్యలు చేపడుతామన్నారు.

### రంగారెడ్డి జిల్లాలో..

షాబాద్, మార్చి 30 : యాసంగి ధాన్యం సేకరణపై రంగారెడ్డి జిల్లాయంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. జిల్లావ్యాప్తంగా 95వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా, సుమారు 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. జిల్లాలో 35 కేంద్రాలను ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఏప్రిల్ 1వ తేదీన ప్రారంభించి మే నెల చివరి నాటికి పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. పీఏసీఎస్, ఐకేపీ, డీసీఎంఎస్ ద్వారా ధాన్యం సేకరణ పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. 'ఏ' గ్రేడ్ క్వింటాలుకు రూ.2,203, 'బీ' గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2,183గా ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించింది.



రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, ఆమనగల్లు(కల్వకుర్తి), ఎల్బీనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని 26 మండలాల్లో 95వేల ఎకరాల్లో వరి సాగైంది. జిల్లాలో 35 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా, పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 31 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 4 కేంద్రాలను జిల్లాయంత్రాంగం ఏర్పాటు చేయనున్నది.

### నాణ్యమైన ధాన్యం సేకరణే లక్ష్యం..

నాణ్యమైన ధాన్యం సేకరణపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. 17శాతం తేమ ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్యాడీ క్లీనింగ్ మిషన్‌లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ కాంటాలు, గోనే సంచులను అందుబాటులో ఉంచారు. 10లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

### 35 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు..

**విజయలక్ష్మి, రంగారెడ్డిజిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్**

జిల్లాలో ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేశాం. జిల్లావ్యాప్తంగా మొత్తం 35 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ధాన్యం సేకరణ ప్రారంభించి మే నెల చివరి నాటికి పూర్తి చేస్తాం. రైతుల నుంచి 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు చర్యలు చేపడుతున్నాం. ధాన్యానికి సంబంధించి 10లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.